క్లుప్తంగా

బూరుగడ్డ ఆలయంలో సహస్ర కుంకుమార్చన



గోపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించా రు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ధ ర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగు విత్తనాలు

నేరేడుచర్ల : మండలంలోని రైతులకు 30 క్వింటాల జిలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జావీద్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్‌లతో స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

జీపీఓగా 17 మంది అర్హత

హుజూర్‌నగర్ : ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రామ పాలన అధికారి (జీపీఓ) అర్హత పరీక్షల్లో పలువురు ఉత్తీర్ణత సాధించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన 18 మంది ఈ పరీక్ష రాయగా అందులో 17 మంది అర్హత సాధించారు. వారిలో ఆరుగురు జిల్లా స్థాయిలో 30 లోపు ర్యాంకులు సాధించారు. వారిలో మూగుండ్ల సైదులు (7వ ర్యాంకు), పులి కౌసల్య (10), బండ్ల అన్నపూర్ణ (16), క్కుడపు సుకన్య (20), కాకునూరి ఆనంద్‌రెడ్డి (24), బుడిగె లక్ష్మి(30) ర్యాంకులు సాధించారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలోని మూడో వార్డు గణేష్ నగర్‌లో మున్సిపల్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గడిచిన ఐదేళ్లుగా మున్సిపాలిటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి బాబు, చంద్రశేఖర్, నాగేంద్రబాబు, వెంకటరెడ్డి, బాబురావు, కార్తీక్, శివ, పిశ్కెలై రామ్మూర్తి, నగేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ



మోతెలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

మోతె : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం మోతె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ప్రభుత్వ బడిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా భోజనం, ఉచిత పుస్తకాలు అందిస్తుందన్నారు. అనంతరం పేరెంట్స్, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు భరోసా జమ చేయాలి



మాట్లాడుతున్న యాకూబ్

గరిడేపల్లి : వానాకాలం సాగు సీజన్ ప్రారంభవుతున్నందున జూన్ 5 నాటికి రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని, రూ. 2 లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ కోరారు. శుక్రవారం గరిడేపల్లి మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో తుమ్మల సైదయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అర్జున్, సోమయ్య, మట్టయ్య, సుశీల, వెంకటేశ్వర్లు, కలమ్మ, శ్రీనివాస్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి బజార్‌లో ట్రా‘ఫికర్’

- ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి నిత్యం భారీ వాహనాల రాక
- ఇరుకు రోడ్డులో ఇబ్బందులు
- పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికుల వేడుకోలు



బొడ్రాయి బజార్‌లో భారీ వాహనం రావడంతో నిలిచిన వాహనాలు

కోదాడ : కొందరు వ్యాపారుల స్వార్థానికి ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం తోడవడంతో కోదాడ పట్టణంలోని బొడ్రాయి బజార్ వాసులతో పాటు ఇతర వ్యాపారులు నిత్యం నరకం చూస్తున్నారు. ఒక్క వాహనం వెళ్లడానికే ఇరుకుగా ఉన్న ఈ బజార్‌లోకి భారీ వాహనాలను అనుమతిస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనాలు వెనకకు వెళ్లలేక, ముందుకు సాగక గంటల తరబడి ఈప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ బజార్‌లోకి తెల్లవారిన తరువాత భారీ వాహనాలను అనుమతించకూడదు. కానీ ఉదయం పది గంటల తరువాత కూడా భారీ వాహనాలను అనుమతిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈవిషయంపై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే కొన్నిసార్లు పట్టించుకోవడం లేదని, కొన్నిసార్లు స్పందించినా జరిమానాలతో సరిపుచ్చుతున్నారని ఈ బజార్‌వాసులు ఆరోపిస్తున్నారు. ఈ బజార్‌లోకి ఉదయం 8 గంటల తరువాత నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వాహనాలను అనుమతించొద్దని కోరుతున్నారు. ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరించి ముమ్ముందు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గతంలో ఉదయం 8 గంటల లోపే..

కోదాడలోని బొడ్రాయి బజార్‌లో నిత్యావసర వస్తువుల వ్యాపారం చేసేవారికి ప్రతి రోజు లారీల్లో సరుకు వస్తుంది. దీన్ని అనులోడ్ చేయడానికి భారీ వాహనాలు ఈ బజార్‌లోకి వస్తుంటాయి. గతంలో వీటితో సమస్య వస్తుండడంతో ఉదయం 8 గంటల లోపు సాయంత్రం 9 గంటల తరువాత భారీ వాహనాలను అనుమతించేవారు. ఆ సమయంలో ట్రాఫిక్ ఉండదు కాబట్టి ఎవ్వరికి ఇబ్బంది ఉండేది కాదు. కానీ కొంత కాలంగా ఉదయం 10 గంటల తరువాత కూడా ఈ బజార్‌లోకి భారీ వాహనాలను అనుమతిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ఈ బజార్‌వాసులు చెబుతున్నారు.

ఆజాద్ నగర్‌లో కూడా..

కోదాడ పట్టణంలోని బొడ్రాయి బజార్‌తో పాటు ఆజాద్ నగర్‌కు వెళ్లే రంగా థియేటర్ పక్క బజార్‌లో కూడా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ రోడ్డులో గల హోటళ్లకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డు మీదే నిలుపుతుండడంతో ఉదయం, సాయంత్రం ఈ బజార్‌లోకి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ బజార్‌లో ఉన్న గ్యాస్‌స్టవ్‌లు, కూలర్లు రిపేర్ చేసే వారు కూడా తమ వస్తువులను రోడ్డు మీద ప్రదర్శనకు పెడుతుండడంతో పాటు దుకాణాల బోర్డులను కూడా రోడ్డుమీద పెడుతున్నారని దీంతో సమస్య తీవ్రంగా మారుతోందని ఈ ప్రాంత వాసులు అంటున్నారు.

వాహనాలను సీజ్ చేస్తాం

బొడ్రాయి బజార్‌లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వాహనాలకు అనుమతి లేదు. కొందరు వ్యాపారులు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. రూల్స్ ఉల్లంఘిస్తున్న వారిని అనేకసార్లు హెచ్చరించాం. జరిమానాలు కూడా విధించాం. ఇక నుంచి బొడ్రాయి బజార్‌కు భారీ వాహనాలు వస్తే వాటిని సీజ్ చేస్తాం. వ్యాపారులు కూడా పోలీసులకు సహకరించాలి.

– మల్లేశం, ట్రాఫిక్ ఎస్ఐ, కోదాడ

ఎత్తిపోతలకు మరమ్మతులు చేపట్టాలని వినతి



నీటిపారుదల శాఖ సీఈకి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరావు, తదితరులు

మునగాల : వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున సాగర్ ఎడమ కాలువపై మునగాల మండలంలోని కొక్కిరేణి శివారులో నిర్మించిన జయభారత్ ఎత్తిపోతల పథకం (ఎల్–30, 31) మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎత్తిపోతల పథకం చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు శుక్రవారం సూర్యాపేటలో నీటి పారుదల శాఖ సీఈ రమేష్‌బాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొక్కిరేణి ఎత్తిపోతల పథకం మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు. కాలువ కట్టలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, తూములకు షట్టర్లు లేవని, రెండవ స్టేజీ వద్ద పైపులు లీకేజీ అవుతున్నాయని తెలిపారు. దీంతో ఎత్తిపోతల పథకం చివరి భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎత్తిపోత పథకం కింద గరిడేపల్లి మండలం వెలిదెండ, పెన్‌పహాడ్ మండలం చెట్ల ముకుందాపురం, మునగాల మండలం కొక్కిరేణి, తిమ్మారెడ్డి గూడెం గ్రామాలకు చెందిన రైతుల భూములకు సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కొక్కిరేణి మాజీ సర్పంచ్‌లు వక్కంతుల ప్రభాకర్‌రావు, రావులపెంట వెంకన్న, రైతులు చినగాని సాంబయ్య, పోటు దుర్గారావు, పోటు అశోక్‌కుమార్, ధారావత్ రవి, రావులపెంట బ్రహ్మం, రేఖ లింగయ్య పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీదేవి

హుజూర్‌నగర్ : వానాకాలం పంటల సాగులో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని భారతీయ వ్యవసాయ వరి పరిశోధన స్థానం (హైదరాబాద్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.శ్రీదేవి, కేవీకే (గడ్డిపల్లి) శాస్త్రవేత్త సీహెచ్. నరేష్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రాబోయే వానాకాలం పంటల సాగు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై శుక్రవారం చింతలపాలెం మండలం తమ్మవరంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పురాతన పద్ధతులకు తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయిస్తూ పంటలు సాగు చేయడం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. భూసార పరీక్షలకు మట్టిని సేకరించే విధానం, వివిధ రకాల జీవన ఎరువుల వాడకం వల్ల కలిగే ఉపయోగాలతోపాటు యాంత్రీకరణ వినియోగం గురించి రైతులకు వివరించారు. ఈ సదస్సులో ఏఓ శశాంక్, ఏఈఓ సంధ్య, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ రవి, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డు ఉపాధ్యాయుడు మృతి



వెంకట నరసింహారెడ్డి (ఫైల్)

మునగాల : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొప్పుల వెంకట నరసింహారెడ్డి(85) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. వెంకట నరసింహారెడ్డి భార్య 27 ఏళ్ల క్రితం అనారోగ్యం బారిన పడి మృతి చెందడంతో కుమారుల వద్ద ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌కు వెళ్లగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడే కిందపడిపోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మృతుడి కుమారులు తెలిపారు. వెంకట నరసింహారెడ్డి గతంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడిగా, స్థానిక శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం నాయకుడిగా కొనసాగుతున్నారు. వెంకట నరసింహారెడ్డికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న కొప్పుల జైపాల్‌రెడ్డి రెండవ కుమారుడు. వెంకట నరసింహారెడ్డి మృతి వార్త సమాచారం అందుకున్న పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సంతాపం ప్రకటించారు. శనివారం మునగాలలో వెంకట నరసింహారెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారులు మట్టారెడ్డి, జైపాల్‌రెడ్డి తెలిపారు.

గ్రామ పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వేపలసింగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ హెచ్చరించారు. శుక్రవారం వేపలసింగారంలో వీధిలో ఉప్పతల ప్రశాంత్ బోరు వేస్తుండగా గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో పంచాయతీ కార్యదర్శి అడ్డుకున్నారు. జీపీ స్థలంలో బోరు వేయవద్దని సదరు వ్యక్తికి సూచించారు. అయినా అతను వినకుండా బోరు వేస్తుండటంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు బోరు బండిని, ప్రశాంత్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు కార్యదర్శి తెలిపారు. ఆయన వెంట జీపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన సైదులు

మునగాల : జాతీయ రహదారిపై మునగాల మండలం బరాఖత్‌గూడెం శివారులో ఫ్లైఓవర్‌పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన వట్టె సైదులు తన ట్రాక్టర్‌పై మునగాల నుంచి స్వగ్రామం వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ట్రాక్టర్‌పై ఉన్న సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో సైదులును చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

మునగాల : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ సూచించారు. మండలంలోని తాడువాయిలో రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే, ఫ్రైడే నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటిలో పగిలిన కుండల్లో, ప్లాస్టిక్ గ్లాసులలో వాడకుండా ఉన్న కూలర్లలో నిలువ నీరు ఉండకుండా చూడాలన్నారు. ఏదైన జ్వరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ వైష్ణవి, ఆరోగ్య విస్తరణాధికారి భాస్కర్‌రాజు, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, లింగయ్య, ఏఎన్ఎంలు సుచరిత, పావని, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం

నడిగూడెం : పచ్చిరొట్ట పంటల సాగుతో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో ప్రభుత్వం నుంచి రాయితీపై మంజూరైన జీలుగ విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రైతు ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట పంటలైన జీలుగ, పిల్లి పెసర, జనుము పంటలు సాగు చేసుకోవాలన్నారు. దీంతో రసాయన ఎరువుల ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో నడిగూడెం సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు, ఏఈఓ పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారి దేవప్రసాద్

ఆ గోవులు ఎక్కడివి ?

- చెన్నారిగూడెంలో పోలీసుల విచారణ



చెన్నారిగూడెంలో 48 గోవులను పరిశీలిస్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని చెన్నారిగూడెం గ్రామంలో శుక్రవారం 48 గోవులు ఒక్కసారిగా యాదవుల బజార్‌కు వచ్చాయి. వాటి యజమానులు ఎవరూ లేకపోవడంతో గ్రామస్తులు వాటిని శ్మశాన వాటిక స్థలంలోకి తరలించారు. స్థానికులు ఎస్ఐ రాంబాబు గౌడ్‌కు సమాచారం అందించడంతో ఆయన అక్కడకు చేరుకుని పరిశీలించారు. సాగర్ ప్రధాన కాలువ దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని గ్రామస్తులు తెలపడంతో పోలీసులు అక్కడకు వెళ్లగా నిందితులు పరారయ్యారు. ఇదిలా ఉండగా ఆర్లెగూడెం గ్రామ పంచాయతీ రామ్‌నగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు గోవులు తమవేనని చెప్పారు. అయితే పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. వాటిని శ్మశాన వాటిక స్థలం నుంచి ఆచార్యులగూడెం జెడ్పీ పాఠశాల ఆవరణలోకి తరలించారు. విషయం తెలుసుకున్న మండలానికి చెందిన బీజేపీ, విశ్వ హిందూ పరిషత్ నాయకులు చెన్నారిగూడెం చేరుకొని గోవులను పరిశీలించారు. పోలీసులు విచారణ చేసి బక్రీద్ పండుగ తర్వాతనే గోవులను వాటి యజమానులకు అప్పగించాలని కోరుతున్నారు.

పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ



గరిడేపల్లి : హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎంఈవో చత్రునాయక్

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వం నుంచి సరఫరా అయిన విద్యార్థుల యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ చత్రునాయక్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సైదులు, బాలసైదిరెడ్డి, చంద్రయ్య, రవీందర్‌రెడ్డి, పాపయ్య, ముత్యాలరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రమేష్, మంగమ్మ, సీఆర్పీలు రామకృష్ణ, రాములు, వెంకటేశ్వర్లు, అశోకుడు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలానికి ప్రభుత్వం నుంచి ముందస్తుగా 7561 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో 25 ప్రాథమిక పాఠశాలలు, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, ఆయా పాఠశాలల్లో 1700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఆయా పాఠశాలలోని విద్యార్థులకు రావాల్సి 14,181 పాఠ్య పుస్తకాలకు గాను ప్రస్తుతం 7561 పుస్తకాలను మాత్రమే సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు జూన్ 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం నాటికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రేపటి నుంచి గురప్పస్వామి పండుగ

- రూ.కోటితో ఆలయ పునర్నిర్మాణం
- విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు
- 3న స్వామివారికి మొక్కుల చెల్లింపు



తాడువాయిలో పునర్నిర్మించిన గురప్పస్వామి దేవాలయం

మునగాల : మండలంలోని తాడువాయిలో యాదవుల ఆరాధ్యదైవం గురప్పస్వామి ఆలయంలో జూన్ 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పండుగ నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. 2014లో ఆలయంలో గ్రామస్తులు చివరిసారిగా పండుగ జరుపుకున్నారు. గురప్ప ఆలయం దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2014నుంచి నేటి వరకు పండుగ చేసుకునే వీలు లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులు రూ.కోటి పోగు చేసి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈనెల 19న దిష్టి పూజా జరిపారు. దిష్టి పూజా నిర్వహించిన రెండు వారాల అనంతరం పండుగ చేసుకోవడం ఇక్కడ ఆనవాయితీ. జూన్ 1న గ్రామ ఆడపడుచులు గంపలతో ఊరేగింపుగా గురప్ప ఆలయానికి చేరుకుంటారు. జూన్ 2న యలమంచలమ్మ తల్లి పరివార దేవతలకు మైలభోజనం సమర్పణ, పతన్‌దారుల మొక్కులు నిర్వహించుట, 3న యలమంచమ్మ తల్లికి చంద్రపట్నం, మొక్కుల చెల్లింపు, గురప్పస్వామికి చంద్రపట్నం, పతాన్‌దార్ల, భక్తుల మొక్కుల సమర్పణ ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు సాయంత్రం గ్రామ పురవీధుల్లో గురప్పస్వామి ఉత్సవమూర్తుల విగ్రహాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించాం



తాడువాయిలో శిథిలావస్థకు చేరిన గురప్పస్వామి ఆలయాన్ని గ్రామస్తులు, యాదవ కులస్తుల సహకారంతో రూ.కోటి వ్యయంతో మూడేళ్ల పాటు పునర్నిర్మించాం. ఆలయ నిర్మాణానికి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి విరాళాలు ఇచ్చారు. జూన్ 1 నుంచి ఆలయంలో మూడు రోజుల పాటు పండుగ నిర్వహించేందుకు గ్రామస్తులంతా సిద్ధమవుతున్నాం.

– గోపిరెడ్డి రామిరెడ్డి, ఆలయ ధర్మకర్త, తాడువాయి

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్రనామాచర్చనలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమా చార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.10.50 లక్షల ఆదాయం

మట్టపల్లి దేవాలయంలో తలనీలాలు సేకరించుకునే హక్కుకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలంలో దేవాలయానికి రూ.10 లక్షల 50 వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి టి.వెంకటాచలపతి సమక్షంలో నిర్వహించిన వేలంలో ఆరుగురు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా త్రిపురారంనకు చెందిన అవిరెల్లి నాగయ్య రూ.10 లక్షల 50 వేలకు ఒక ఏడాది కాలానికి గాను తలనీలాలు సేకరించుకునే హక్కును వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అంత్యోదయ కార్డులివ్వాలి

మునగాల : రాష్ట్రంలోని దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం మునగాల మండల కేంద్రంలో తహసీల్దార్ బి.రామకృష్ణారెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు కాసాని మల్లయ్యగౌడ్, జంగిలి గోపి యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, మండల నాయకులు వాడపల్లి నరేష్, బత్తుల రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని, కూలీలకు వంద రోజులు పని దినాలు కల్పించడంలో విఫలమవుతోందని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య ఆరోపించారు. శుక్రవారం మండలంలోని గోపాలపురంలో ఆయన ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకొని మాట్లాడారు. దశల వారీగా ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టడం సరికాదన్నారు. కూలీలు పని చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే ప్రమాద బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐఎన్‌టీయూసీ బ్లాక్ అధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముక్కంటి, నాగేందర్, రామారావు, ఉపాధి కూలీలు ఉన్నారు.

సీసీరోడ్డు వేశారు.. మట్టి మరిచారు

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామంలో గల పలు వీధుల్లో ఇటీవల లక్షల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మించారు. కానీ సీసీ రోడ్లకు ఇరుపక్కలా మట్టి పోయడం మరిచారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్జిన్‌లో మట్టి లేకపోవడంతో రోడ్డు అంచున వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్ల వెంట మట్టి పోయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



సీసీ రోడ్డు వెంట మట్టి పోయకుండా వదిలేసిన దృశ్యం

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురంలో ప్రధాన రహదారి వెంట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో రెండేళ్ల క్రితం ఓ బాలుడు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. అయినా సంబంధిత అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడం లాంటి చర్యలు చేపట్టలేదు. ఈ రహదారి వెంట నిత్యం అనేక మంది ప్రజలు రాకపోకలకు కొనసాగిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రహదారి వెంట చుట్టూ కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్